❖•❖•❖ 56 ❖•❖•❖

# సబలము యొక్క సాక్ష్యము

*“కాబట్టి సైనికులు వచ్చి ఆయనతో కూడ సిలువవేయబడిన మొదటి వాని కాళ్లను రెండవవాని కాళ్లను విరుగగొట్టిరి; వారు యేసు నొద్దకు వచ్చి, అంతకుముందే ఆయన మృతిపొందియుండుట చూచి, ఆయన కాళ్లు విరుగగొట్టలేదు. గాని సైనికులలో ఒకడు ఈటెతో ఆయన ప్రక్కను పొడిచెను. వెంటనే రక్తమును నీళ్లును కారెను. ఇది చూచిన వాడు సాక్ష్యమిచ్చుచున్నాడు; ఆతని సాక్ష్యము సత్యమే; మీరు నమ్మునట్లు అతడు సత్యము చెప్పుచున్నాడని ఆయనెరుగును, ‘అతని యెముకలలో ఒకటైనను విరువబడదు’ అను లేఖనము నెరవేరునట్లు ఇవి జరిగెను. మరియు ‘తాము పొడిచినవానితట్టు చూతురు’ అని మరియొక లేఖనము చెప్పుచున్నది” (యోహాను 19:32-37).*

సాధారణంగా, సిలువవేయబడిన శరీరము శాసనోల్లంఘనము యొక్క పరిణామములను బట్టబయలుచేయు ఒక బహిరంగా హెచ్చరికయై యుండునట్లు రోమీయులు దానిని సిలువపైనే విడిచిపెట్టారు. టైబీరియస్, యేసు సిలువవేయబడినప్పుడు అధికారములో ఉండిన చక్రవర్తి, సిలువవేయబడినవారి శరీరములను వారి బంధువులు తీసికొని వెళ్లి వాటిని భూస్థాపన చేయుటకు వారికి అనుమతినిచ్చాడు.[1]

సిలువవేయబడినవారి శరీరములను ఏమి చేయవలెనో యను నిర్దేశనములను తెలిసికొనుటకు యూదులు పాత నిబంధనతో పోల్చి చూచుకున్నారు:

> మరణశిక్షకు తగిన ... అతని చంపి మ్రాను మీద వ్రేలాడదీసినయెడల అతని శవము రాత్రివేళ ఆ మ్రానుమీద నిలువకూడదు వ్రేలాడదీయబడినవాడు దేవునికి శాపగ్రస్తుడు గనుక, నీ దేవుడైన యెహోవా స్వాస్థ్యముగా నీకిచ్చుచున్న దేశమును నీవు అపవిత్రపరచకుండునట్లు అగత్యముగా ఆ దినమున వానిని పాతిపెట్టవలెను (ద్వితీయోపదేశకాండము 21:22, 23).

యేసు ప్రాణము విడిచెను అని యోహాను[2] చెప్పిన తరువాత, యూదులు (బహుశ సిలువవేయబడిన వారి విషయములో ధర్మశాస్త్రమును పాటించుట గూర్చి ఆందోళన చెందుచుండిన యూదుల మహా సభకు సంబంధించిన కొందరు సభ్యులై యుండవచ్చును) పిలాతు నొద్దకు వెళ్లి వాధితులు చంపబడి వారి శరీరములు సిలువమీదనుండి దింపబడవలెనని అడిగారని యోహాను[2] వ్రాయుచున్నాడు. ముఖ్యముగా పస్కాకు ముందుగనే శరీరములు దింపబడుట గూర్చిన ధర్మశాస్త్ర ఆదేశమును పాటించుటకు యూదులు కలవరము చెందుచుండినవారై యుండిరి. అది శుక్రవారము, "సిద్ధపరచు దినము" మరియు సబ్బాతు అతి సమీపంలో ఉన్నది. ఏర్పాట్లన్నీ చక్కగా చేయబడాలి, ఏలయనగా సబ్బాతు దినమున ఏ పనినైనను చేయకూడదు. భోజనం సిద్ధంచేసుకోవాలి, ఈ పవిత్ర దినమును నమ్మకంగా పాటించునట్లు ఇతర ఏర్పాట్లు కూడా చేయబడాలి. ఈ ప్రత్యేక సబ్బాతు దినము యింకా ఎంతో పవిత్రమైనదై యున్నది. ఈ దినమును యోహాను "మహాదినము" అని పిలుచుచున్నాడు, ఎందుచేతనంటే, అది పస్కా పండుగను ఆచరించు వారములోని సబ్బాతు దినమై యున్నది. ఈ ప్రత్యేక సబ్బాతు కొరకు వారు తమ్మును తాము ఆచారబద్ధంగా శుద్ధులుగా ఉంచుకొనవలెనని యూదులు ఆశించారు. వారి పట్టణము మరియు దేశము మీదకు దేవుని ఎటువంటి శాపమైనను రాకుండునట్లుగా, వారు పస్కాను పాటించుట యెహోవాకు అంగీకారమైనదై యుండాలని ఆశించారు. గనుక నేరస్థులు చంపబడవలెననియు వారి శరీరములు సిలువల మీద నుండి దింపబడవలెననియు వారు వెళ్లి పిలాతుకు విజ్ఞప్తి చేశారు.

పిలాతు దాని గూర్చి ఎటువంటి ఆక్షేపణ తెలుపకుండానే సమ్మతించాడు, సిలువవేయు సిబ్బంది నేరస్థులను చంపవలెననియు వారి శరీరములను దింపవలెననియు ఆదేశములను జారీ చేశాడు. పిలాతు ఉత్తరపు మేరకు, సిలువవేయు కార్యమునకు బాధ్యులైయుండిన సైనికులు వచ్చి మరణించుచుండిన ప్రతి ఒక్కని కాళ్లు విరుగగొట్టు ప్రక్రియను ప్రారంభించారు.

ఏదో ఒక కారణాన్నిబట్టి, సైనికులు యేసు దగ్గరకు చివరగా వచ్చారు. బహుశ వారు మామూలుగా ఎడమ ప్రక్క ముగించుకొని కుడి ప్రక్కకు వచ్చి ఆ తరువాత మధ్యకు వచ్చియుంటారు. అంతవరకు జరిగినదానంతటి గూర్చి వారు ఆశ్చర్యంతో భయపడుచు, తెలిసీతెలియని మొరటు భక్తితో యేసుని గూర్చిన ఉత్తరపు ప్రకారమైన పని ముగించడానికి వారు వేచియుండుట, సాధ్యమే.

ఇద్దరు దొంగల కాళ్లను విరుగగొట్టుటకు వారు ఒక విధమైన కర్ర సమ్మెటను ఉపయోగించారు. ఇది *క్రూరిఫ్రేజియమ్*, "ఒక బరువైన సాధనముతో నలుగగొట్టు"

పద్ధతి అని పిలువబడింది. అప్పటికే సిలువవేయబడి చిత్రహింస వలన బాధపడుచుండిన వానికి మరింత బాధకలిగించుటకు ఈ పద్ధతి కొన్ని పర్యాయాలు వాడబడింది, కానీ ఈ సందర్భములో వారు శీఘ్రముగా మరణించునట్లు ఈ పద్ధతిని ఉపయోగించారు. కాళ్ల ఆధారం లేకుండా, బాధితుడు సరిగా ఊపిరి తీసికొనగలుగునట్లు తనను తాను పైకి లేపలేకుండెను. దొంగలు ఖచ్చితంగా కొన్ని నిమిషాల్లోనే కండరాల ఆకస్మిక ఈడ్పుల వలన కలుగుచుండిన బాధాయుతమైన నొప్పితో మరణించియుంటారు.

సైనికులు యేసును సమీపించినప్పుడు, అప్పటికే ఆయన తన ప్రాణం విడిచాడని కనుగొన్నారు. వారిలో ఒకడు ఒక బల్లెము తీసికొని యేసు ప్రక్కలో పొడిచాడు. మనకు ఎక్కువ వివరాలు ఇవ్వబడలేదు. కానీ "వారు యేసు నొద్దకు వచ్చి, అంతకుముందే ఆయన మృతిపొందియుండుట చూచి ఆయన కాళ్లు విరగగొట్టలేదు. గాని సైనికులలో ఒకడు ఈటెతో ఆయన ప్రక్కను పొడిచెను" అని యోహాను ఎప్పటివలెనే మామూలు మాటల్లో వ్రాశాడు (యోహాను 19:33, 34ఎ).

*బల్లెము యేసు ప్రక్కలోనికి దూరిన తరువాత:* "వెంటనే రక్తమును నీళ్లును కారెను" అని యోహాను చెప్పుచున్నాడు (యోహాను 19:34బి). అప్పుడు గ్రంథకర్త, ఇతడే, జరిగిన దానిని ఆయన స్వయంగా తన కళ్లారా చూచిన సాక్షి అని నొక్కివక్కాణించుటకు తన కథాంశము యొక్క వరసక్రమాన్ని దారి తప్పించాడు. "ఇది చూచిన వాడు సాక్ష్యమిచ్చుచున్నాడు; అతని సాక్ష్యము సత్యమే; మీరు నమ్మునట్లు, అతడు సత్యము చెప్పుచున్నాడని ఆయనెరుగును" అని చెప్పుచున్నాడు (యోహాను 19:35). ఆయన తెలియజేయుచున్న నివేదిక నిరవధికంగా, యుగయుగములకు మేలైనదని తెలియునట్లు, తన మనస్సులోని మాటను నిస్సంకోచంగా వెల్లడించుట కొరకే ఉద్దేశింపబడినదని ఆయన ఎన్నుకొన్న క్రియాపదము సూచించుచున్నది.

సైనికులు దొంగల కాళ్లను విరుగుగొట్టుట యోహాను చూశాడు. ఆ బాధను భరించలేకుండిన దొంగలు, ఊపిరి సలుపలేక ఉక్కిరిబిక్కిరగుచూ తుది శ్వాసను విడుచుచుండినప్పుడు వారు వేదనతో మూలుగుట విన్నాడు. వాని ఆత్మ పరదైసులో యేసుతో కూడా ఉండుటకు పరుగెత్తుకొని పోవుచుండగా వాని తలను కనికరముతో నిండియుండిన మరణ నిద్రలోనికి మళ్లించుటను ఆయన చూశాడు. ఇది ఇలా వుండగా వాని ఆత్మ అత్యంత భయానకమైన నిత్య బీభత్సాన్ని అనుభవించుటకు ఈ లోకాన్ని విడిచి వెళ్లుచుండగా రెండవ దొంగ మరణముతో బలహీనంగా తూగుచుండినట్లు చూశాడు. ఆ తరువాత యేసు ప్రక్కలో నుండి రక్తము మరియు నీళ్లు స్రవించుట చూశాడు.

"రక్తము మరియు నీళ్లు" అగుపించుట యేసు మరణమును జాగ్రత్తగా అధ్యయనము చేయువారికి అది ఒక మంచి బహుముఖ చర్చనీయాంశమయ్యింది. దానిని వివరించుటకు వైద్యులు ప్రయత్నిస్తారు కానీ వారు జరిగిన విషయంతో ఏకీభవించరు. దీని గూర్చి ఆలోచించునప్పుడు రెండు సత్యములను మనస్సులో ఉంచుకోవాలి. ఒకటి, యేసు మరణించాడని రూఢిపర్చుటకు యోహాను ఈ సంఘటనను నివేదించాడు. రెండవది, పరిపూర్ణుడైన మానవుడు, శరీరధారియైన దేవుని కుమారుడు, లోక పాపముల నిమిత్తమై శారీరకంగాను ఆధ్యాత్మికంగాను తననుతాను అప్పగించుకొనుచుండగా సంభవించిన దానిని మనలో ఏ ఒక్కరమైనను సంపూర్తిగా అవగాహన చేసికొనలేము.

*అయితే ఒక్క వాస్తవము ఖచ్చితంగా నిశ్చయము:* యేసు మరణమునకు సంబంధించినంత వరకు ఈ ఈటె ఒక ప్రత్యేక సాక్ష్యమును ఇచ్చుచున్నదని యోహాను గమనించాడు. అప్పటికే, దేశమంతా చీకటి కమ్ముకొనుట, భూమి కంపించుట, దేవాలయపు తెర చినుగుట, సమాధులు తెరవబడుట, శతాధిపతి మరియు ఆయనతోకూడ ఉండినవారు యేసు దేవుని కుమారుడై యుండెనని ప్రకటించుటను సిలువ చెంత ఉండినవారు చూశారు మరియు విన్నారు. నలుదిశల ప్రతిధ్వనించు నిదర్శనమునకు ఈ ఈటె దాని మౌన సాక్ష్యాన్ని అదనంగా చేర్చుట ద్వారా, అదేమని చెప్పుచున్నది?

*ఈ ఈటె ధ్రువీకరణమును నొక్కి వక్కాణించింది:* యేసు మరణించాడు. ఈ మరణము నిజమని నిరూపింపబడునట్లు ఈటె బలముగా పొడువబడింది. "వారు యేసునొద్దకు వచ్చి, *అంతకుముందే ఆయన మృతిపొంది* యుండుట చూచి ..." అని యోహాను చెప్పుచున్నాడు (యోహాను 19:33ఎ; నొక్కి చెప్పింది నాది). ఈ మాటలతో, యేసు సిలువ మీద నుండి దింపబడక మునుపే మరణించాడో లేదో అని ఎవరైనాగాని సందేహంతో మారు ప్రశ్నించలేకుంటున్నట్లు యోహాను రూఢిపర్చాడు.

ఈటెను ఇలా బలముగా గుచ్చుట ద్వారా యేసు కేవలము స్పృహ తప్పిపోయాడనియు, ఆయనలో ప్రాణము యింకా నిలిచియుండినదనియు గల ప్రతి శంక తొలగింపబడింది. యేసు సమాధిలో నుండి ఆదివారం ఉదయం లేచాడు; కానీ భూస్థాపనగాని పునరుత్థానముగాని జరుగక మునుపు, మరణించుట తప్పనిసరిగా జరగాలి. ఈ లెక్క చొప్పున నిశ్చయంగా మరణం సంభవించిందని ఈటె చాటి చెప్పింది.

*ఈటె ఒక నిర్ధారణను ప్రతిధ్వనించింది: యేసు దైవికమైనవాడు.* యేసు ప్రక్కలోనికి బల్లెము పొడువబడుట గూర్చి వివరించిన తరువాత, "... లేఖనము నెరవేరునట్లు ఇవి జరిగెను" అని యోహాను చెప్పుచున్నాడు (యోహాను 19:36బి). రోమా సైనికుల చర్యలు ప్రవచనములను నెరవేర్చుటకు ఉపయోగించుకున్నాడు కాబట్టి, తద్వారా, యేసు దేవుడు పంపినవాడని నిర్ధారించుటకు ఆయన వాటిని ఉపయోగించుకున్నాడు.

యేసు శరీరములోని యెముకలలో ఒక్కటైనను విరువబడలేదని తెలియజెప్పుటలో, యోహాను పాత నిబంధనలో పస్కాపరమైన గొఱ్ఱెపిల్ల గూర్చి వ్రాయబడియున్న ఆదేశమును గుర్తుకు తెచ్చాడు. ఆయన నిర్గమకాండము 12:46ను ఉల్లేఖనగా తీసికొని, "అతని (గొఱ్ఱెపిల్ల) యెముకలలో ఒకటైనను విరువబడదు" అని చెప్పుచున్నాడు (యోహాను 19:36ఎ). యేసు, దేవుని పరిపూర్ణమైన గొఱ్ఱెపిల్ల, మన పాపముల నిమిత్తము తననుతాను అర్పించుకున్నాడు – మరియు ఆయన అర్పణ మోషే ఆదేశములను అనుసరించుచున్నదై యున్నది.

ఆయన గమనించుచుండగా, యోహాను మరొక లేఖన వాక్యమును గుర్తుకు తెచ్చుకున్నాడు: "వారు తాము పొడిచినవాని మీద దృష్టియుంచి ..." (జెకర్యా 12:10బి). ప్రవక్తయైన జెకర్యా చేత ఇవ్వబడిన వర్ణన కూడ యేసు మరణములో నెరవేరింది. యేసు ప్రక్కన పొడువబడుట అనేక సంవత్సరములకు మునుపే దేవుడు ప్రకటించిన ప్రణాళికలో భాగమై యున్నది. యోహాను ఈ ప్రవచనము ప్రకటన 1:7లో కూడా సూచించుచున్నాడు.

యేసు లేఖనములను నెరవేర్చాడని మత్తయి, మార్కు, లూకా మరియు యోహాను వ్రాసిన సువార్తలలో గల ఆయన సిలువశ్రమల గూర్చిన కథాంశములు మనకు జ్ఞాపకం చేస్తాయి. మెస్సీయా రాకడ కొరకు లోకమును పాత నిబంధన సిద్ధం చేసింది, పలుకబడిన

ప్రవచనములను నెరవేర్చిన మెస్సీయా యేసు అని క్రొత్త నిబంధన బయలుపర్చింది.

అలాగైతే, సబళము ఏమని సంబోధించింది? యేసు మరణించాడని అది చెప్పింది. ఆయన మన పాపముల కొరకు మరణించుటకు వచ్చాడు, ఇప్పుడు ఈ సంఘటన ఇచ్చుచున్న సాక్ష్యము కూడా సరిగ్గా యేసు చేసినది కూడా అదే పని! ఇంతేగాక, యేసు ఆ నాడు మరణించిన మిగిలిన ఇద్దరి నుండి భిన్నమైనవాడని ఈటె ప్రకటించింది. ఆయన దైవత్వమై యుండెను. ఆయన దేవుని కుమారుడై యుండి పాత నిబంధనలో ఆయన గూర్చి ప్రవచింపబడిన ప్రతి ప్రవచనమును నెరవేర్చాడు.

❖•❖•❖

*పరిశుద్ధ బైబిలే మూడు గొప్ప ప్రకటనలు చేయుచున్నది: మెస్సీయా రానైయున్నాడని పాత నిబంధనలో గల ప్రకటన మొదటిది, మెస్సీయా వచ్చాడని సువార్తలలో వ్రాయబడియున్న ప్రకటన రెండవది, మెస్సీయా తిరిగి వస్తాడని పత్రికలు తెలియజేయుచున్న వాగ్దానము మూడవది.*

---

సూచనలు

[1]R. C. H. Lenski, *The Gospel of John* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1958), 1312. [2]యూదులు ఈ వినతి చేశారనియు ఒక సైనికుడు బల్లెమొకటి తీసికొని యేసు ప్రక్కను పొడిచాడనియు యోహాను మాత్రమే పేర్కొన్నాడు. మత్తయి, మార్కు, మరియు లూకా ఈ ఉదంతము గూర్చిన ఊసె ఎత్తుటలేదు.